తక్షణమే అమెరికా వీడండి

- అక్రమ వలసదారులకు అమెరికా ప్రభుత్వం హెచ్చరిక
- 30 రోజులకు మించి ఉంటే తప్పక రిజిస్టర్ చేసుకోవాలి
- లేదంటే జైలు, జరిమానా
- 24 గంటలూ ఐడీలు తమ దగ్గర ఉంచుకోవాల్సిందే
- వలసదారులకు ఆదేశాలు

వాషింగ్టన్, ఏప్రిల్ 13: అక్రమ వలసదారులను దేశం నుంచి పంపించేందుకు అమెరికా ప్రభుత్వం నిబంధనలను కఠినతరం చేస్తున్నది. గడువుకు మించి అమెరికాలో నివసిస్తున్న విదేశీయులు తక్షణమే దేశాన్ని వీడాలని ఆ దేశ హోం ల్యాండ్ సెక్యూరిటీ విభాగం స్పష్టంచేసింది. దేశంలో 30 రోజులకు మించి నివసిస్తున్న విదేశీయులు తప్పనిసరిగా ప్రభుత్వం వద్ద నమోదుచేసుకోవాలని ఆదేశించింది. లేదంటే జరిమానాతోపాటు జైలు శిక్ష తప్పదని హెచ్చరించింది. అందుకే ఇప్పుడే సొంతంగా వెళ్లిపోండి అని సూచించింది.

భారీ జరిమానాలు తప్పవు

స్వీయ బహిష్కరణకు తుది ఉత్తర్వులు పొందికూడా 30 రోజులు దాటి దేశంలో నివసిస్తున్న వారికి రోజుకు 998 డాలర్లు (సుమారు 85,924రూపాయలు) జరిమానాగా విధిస్తామని అమెరికా ప్రభుత్వం హెచ్చరించింది. అలాగే అధికారులకు సమాచారం ఇచ్చిన తర్వాత కూడా స్వీయ బహిష్కరణలో విఫలమైతే వారికి రోజుకు వెయ్యి నుంచి ఐదు వేల యూఎస్ డాలర్లు (రూ.86 వేల నుంచి 4.30 లక్షల వరకు) జరిమానా వేస్తామని తెలిపింది. ఈ సందర్భంగా స్వీయ బహిష్కరణ వల్ల కలిగే ప్రయోజనాలను అధికారులు వివరించారు. అలా చేయడం వల్ల వారు వెళ్లే విమానాలను ఎంపిక చేసుకోవచ్చునని, వారిపై ఎలాంటి కేసులు లేకపోతే అమెరికాలో వారు సంపాదించిన సొమ్మును తమ వద్దే ఉంచుకోవచ్చునని తెలిపారు. ఒక వేళ తమ దేశాలకు వెళ్లే చార్జీలను భరించలేకపోతే వారు సబ్సిడీ విమాన సర్వీసుకు కూడా అర్హులవుతారని పేర్కొన్నారు.

నమోదు తప్పనిసరి

30 రోజులకు పైగా అమెరికాలో నివసిస్తున్న 14 ఏండ్ల వయసు పైబడిన వారందరూ తప్పనిసరిగా ఫాం జీ-325ఆర్ ద్వారా తమ వివరాలు నమోదు చేసుకోవాలి. ఈ ఏడాది ఏప్రిల్ 11 లేదా ఆ తర్వాత వచ్చిన వారు 30 రోజుల్లోగా తమ వివరాలు నమోదు చేసుకోవాలి. లేకపోతే వారికి జరిమానా, జైలు లేదా రెండు శిక్షలు విధించవచ్చు. అలాగే చిరునామా మారితే దానిని 10 రోజుల్లో తెలియజేయకపోతే 5000 డాలర్ల జరిమానా విధిస్తారు. 14 ఏండ్లు నిండిన వారు కూడా రీ రిజిస్ట్రేషన్‌ను 30 రోజుల్లో చేసుకోవాలి.

24 గంటలూ ఐడీలు మీ దగ్గరుండాల్సిందే

అమెరికాలో నివసించే వలసదారులకు ఆ దేశ ప్రభుత్వం కొత్త నిబంధనను తీసుకొచ్చింది. ఇక నుంచి వారు చట్టపరమైన స్థితిని రుజువు చేసే ఐడీ కార్డును నిత్యం తమ వద్దే ఉంచుకోవాలని ఆదేశాలు జారీ చేసింది. దేశంలోని అక్రమ వలసదారులను గుర్తించి వారిని దేశం నుంచి వెళ్లగొట్టడానికే ట్రంప్ ఈ నిర్ణయం తీసుకున్నారు. ఎలాంటి పత్రాలు లేకుండా నివసిస్తున్న అక్రమ వలసదారులకు ఇది చాలా ఇబ్బందికరమేనని చెప్పవచ్చు. ప్రస్తుతం యూఎస్‌లో 54 లక్షల మంది భారతీయులు ఉండగా, అందులో 2,20,000 మంది (అమెరికా మొత్తం వలసదారుల్లో 2 శాతం) అక్రమ వలసదారులే. హెచ్-1బీ వీసాలు కలిగి ఉన్న భారతీయ విద్యార్థులు రిజిస్ట్రేషన్ చేసుకోనక్కర్లేదు. అయితే ఐడీ కార్డులను మాత్రం తప్పనిసరిగా తమ వద్ద ఉంచుకోవాలి.

అమెరికా సందర్శన హక్కు కాదు

అమెరికాను సందర్శించడం హక్కు ఎంత మాత్రం కాదని ఆ దేశ విదేశాంగ శాఖ మంత్రి మార్క్ రుబియో స్పష్టం చేశారు. ఇటీవల వలసవాదులు, కొందరు విదేశీ విద్యార్థుల పట్ల ట్రంప్ ప్రభుత్వం అనుసరిస్తున్న చర్యలపై విమర్శలు వస్తున్న క్రమంలో రుబియో తమ దేశ వైఖరిని సమర్థించుకున్నారు. అమెరికా వీసా అనేది తమ దేశ చట్టాలు, విలువలను గౌరవించే వారికి మాత్రమే ప్రత్యేకించిన హక్కు అని, దరఖాస్తుదారులందరికీ మంజూరుచేసే హక్కు ఎంత మాత్రం కాదని తెలిపారు. ఇటీవల క్యాంపస్‌లలో నెలకొన్న అశాంతి, అంతర్జాతీయ ఉగ్రవాద ఆందోళనలను దృష్టిలో ఉంచుకుని వీసా అర్హత, జాతీయ భద్రత విషయంలో ట్రంప్ యంత్రాంగం రాజీలేని విధానాలను అవలంబిస్తున్నదని అన్నారు. ట్రంప్ బాధ్యతలు చేపట్టాక కొంతమంది విదేశీ విద్యార్థులను బహిష్కరించారు. కొన్ని రకాల వీసాలను రద్దు చేశారు. ఫెడరల్ నిధులను పొందుతూ పాలస్తీనా అనుకూల విధానాలకు మద్దతు తెలియజేస్తున్న యూనివర్సిటీలకు హెచ్చరికలు జారీ చేశారని రుబియో చెప్పారు. ఇవన్నీ తమ జాతీయ భద్రత కోసం తీసుకున్న చర్యలేనని అన్నారు. ఎవరైనా తమకు హాని చేయాలని భావిస్తే కఠిన చర్యలకు వెనుకాడం అని హెచ్చరించారు.

టారిఫ్ అంటే అమెరికన్లపై పన్ను

అమెరికా జనానికి చైనా సందేశం

బీజింగ్: అమెరికా, చైనా మధ్య వాణిజ్య యుద్ధం ముదురుతున్న సమయంలో చైనా సరికొత్త వ్యూహాన్ని రచించింది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రభుత్వంతో చర్చలు జరపడం వంటి వాటిని పక్కనబెట్టి, నేరుగా అమెరికాలోని ప్రజలకు సందేశాన్ని పంపుతున్నది. ట్రంప్ టారిఫ్‌లు విదేశీ ఆర్థిక వ్యవస్థలపై కాదని, అమెరికన్లకే గుదిబండగా మారుతాయని హెచ్చరిస్తున్నది. చైనా విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి మావో నింగ్ ఎక్స్‌లో ఓ వీడియోను పోస్ట్ చేశారు. దీనిలోని వ్యక్తి అమెరికన్లను ఉద్దేశించి మాట్లాడుతూ ట్రంప్ దూకుడు వాణిజ్య విధానాల భారాన్ని భరించవలసినది సామాన్య ప్రజలేనని, విదేశాలు కాదని హెచ్చరించాడు. 'విదేశాలు టారిఫ్‌లను చెల్లిస్తాయా? లేదు. అమెరికన్ వ్యాపార సంస్థలు చెల్లిస్తాయి. ఆ తర్వాత ఆ ఖర్చులు మీ మీద వేస్తారు. టారిఫ్‌లు మాన్యుఫ్యాక్చరింగ్ కంపెనీలను తిరిగి అమెరికాకు తీసుకురావు. అవి కేవలం అమెరికన్లపై పన్నులు మాత్రమే' అని ఆ వ్యక్తి అన్నారు.

ఎలక్ట్రానిక్స్‌పైనా త్వరలో యూఎస్ టారిఫ్‌లు!

వాషింగ్టన్, ఏప్రిల్ 13: ప్రతీకార సుంకాల నుంచి కంప్యూటర్లు, ల్యాప్‌టాప్‌లు, స్మార్ట్ ఫోన్లు, సెమికండక్టర్లను మినహాయిస్తున్నట్టు ప్రకటించి రెండు రోజులు కూడా గడవక ముందే అమెరికా యూటర్న్ తీసుకున్నట్టు కనిపిస్తున్నది. కంప్యూటర్లు, కొన్ని ఇతర ఎలక్ట్రానిక్స్ వస్తువులు కూడా ప్రత్యేక సుంకాల పరిధిలోకి వస్తాయని, సెమికండక్టర్లపై కూడా నెలలోపు టారిఫ్‌లు విధిస్తామని అమెరికా వాణిజ్య కార్యదర్శి హువార్డ్ లూట్నిక్ ఆదివారం తెలిపారు. చైనా నుంచి అధికంగా దిగుమతి చేసుకునే ఎలక్ట్రానిక్స్, ఇతర పరికరాలపై అసాధారణ సుంకాల విధింపు ఉండదని ట్రంప్ ప్రభుత్వం ప్రకటించిన రెండు రోజులకే తాజా ప్రకటన రావడం గమనార్హం. శుక్రవారం చేసిన ప్రకటనతో దిగుమతి పరికరాలపై ఎక్కువగా ఆధారపడే యాపిల్ లాంటి సంస్థలకు మేలు చేకూరుతుందని అందరూ భావించారు. ఎలక్ట్రానిక్ ఉత్పత్తులపై ఈ నెల 2న ట్రంప్ సర్కారు చేసిన ప్రకటన తాత్కాలిక ఉపశమనమేనని లూట్నిక్ తెలిపారు. అవి కూడా సెమికండక్టర్ టారిఫ్‌లకు లోబడి ఉంటాయని చెప్పారు. సెమి కండక్టర్, ఔషధ పరిశ్రమల వాణిజ్యాన్ని తిరిగి అమెరికాకు రప్పించి ప్రోత్సహించడానికి ప్రత్యేక టారిఫ్ మోడల్‌ను అమలు చేస్తామన్నారు.

లేజర్‌తో డ్రోన్లు తుత్తునియలు

- భారత అమ్ములపొదిలోకి చేరిన అత్యాధునిక అస్త్రం
- లేజర్ ఆయుధాన్ని అభివృద్ధి చేసిన డీఆర్‌డీవో
- 5 కిలోమీటర్ల దూరంలోని లక్ష్యాలను ఛేదించే సామర్థ్యం
- ఈ సాంకేతికత కలిగిన అగ్రదేశాల సరసన భారత్



న్యూఢిల్లీ: భారత అమ్ముల పొదిలోకి మరో అత్యాధునిక ఆయుధం చేరింది. విమానాలు, క్షిపణులు, డ్రోన్లను లేజర్ కిరణాల ద్వారా కూల్చివేసే 30 కిలోవాట్ల లేజర్ ఆధారిత ఆయుధ వ్యవస్థను భారత్ విజయవంతంగా ప్రదర్శించింది. కర్నూలులో దీనిని పరీక్షించి నట్టు డిఫెన్స్ రిసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్ (డీఆర్‌డీవో) తెలిపింది. లక్షిత యూఏవీ, డ్రోన్లను లేజర్ డైరెక్టెడ్ వెపన్ (డీ ఈడబ్ల్యూ) ఎంకే- 2(ఏ)విజయవంతంగా ఛేదించిందని, నిఘా సెన్సార్లను డిజేబుల్ చేసిందని వివరించింది. ఇది ఐదు కిలోమీటర్ల దూరంలోని లక్ష్యాలను విజయవంతంగా నేల కూలుస్తుంది. రక్షణ రంగంలో ముఖ్యమైన మైలురాయిగా దీనిని అధికారులు పేర్కొన్నారు. ఈ ఆయుధంతో అగ్రదేశాల సరసన భారత్ చేరింది. ఇప్పటివరకు ఈ తరహా అత్యాధునిక ఆయుధాల సామర్థ్యం అమెరికా, చైనా, రష్యా, ఇజ్రాయెల్‌కు మాత్రమే ఉన్నది. కమ్యూనికేషన్ జామింగ్, శాటిలైట్ సిగ్నల్స్ నిలిపివేత సహా పలు ఎలక్ట్రానిక్ యుద్ధ సామర్థ్యాలు దీనిలో ఉన్నాయని డీఆర్‌డీఓ చైర్మన్ కామత్ తెలిపారు. రోడ్డు, రైలు, గగనం, సముద్రం ఇలా ఎక్కడి నుంచైనా దీనిని ప్రయోగించవచ్చునని చెప్పారు. ఇది పూర్తిగా దేశీయ పరిజ్ఞానంతో తయారైందని వెల్లడించారు. 20 కి.మీ దూరంలోని లక్ష్యాలను ఛేదించే అత్యంత శక్తివంతమైన సూర్యా లేజర్ ఆయుధాన్ని ప్రస్తుతం డీఆర్‌డీవో అభివృద్ధి చేస్తున్నదని తెలిపారు.

క్షిపణి దాడిలో కాలిపోతున్న వాహనాల మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

ఉక్రెయిన్‌పై విరుచుకుపడ్డ రష్యా

- సుమీ నగరంపై బాలిస్టిక్ క్షిపణి దాడులు
- 34 మంది దుర్మరణం 117 మందికి గాయాలు

కీవ్, ఏప్రిల్ 13: ఉక్రెయిన్‌తో జరుగుతున్న యుద్ధాన్ని ఆపాలంటూ అమెరికా తీసుకొస్తున్న ఒత్తిడి రష్యాపై ఏమాత్రమూ పనిచేయటం లేదు. ఉక్రెయిన్ నగరాలే లక్ష్యంగా భీకరమైన క్షిపణి దాడులతో రష్యా విరుచుకపడుతున్నది. తాజాగా ఉక్రెయిన్ ఈశాన్య ప్రాంతంలోని సుమీ నగరంపై రెండు బాలిస్టిక్ క్షిపణులను ప్రయోగించింది. రష్యా జరిపిన అత్యంత భయానక క్షిపణి దాడిలో 34 మంది పౌరులు ప్రాణాలు కోల్పోయారని, మృతుల్లో ఇద్దరు చిన్నారులు ఉన్నారని, మరో 117మంది గాయపడ్డారని ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ ఆదివారం 'ఎక్స్' వేదికగా వెల్లడించారు. 'ఒక సాధారణ నగరంపై రష్యా భయానకమైన క్షిపణిని ప్రయోగించింది. నివాస భవనాలు, విద్యా సంస్థలు, వీధుల్లోని కార్లు, నగరంలోని సాధారణ జీవితం అంతటినీ క్షిపణి దాడి దెబ్బతీసింది' అని జెలెన్‌స్కీ చెప్పారు. రష్యా చర్యను ఖండిస్తూ అమెరికా, యూరప్ గట్టిగా స్పందించాలని ఆయన డిమాండ్ చేశారు. రెండు రోజుల క్రితం రష్యా అధ్యక్షుడు పుతిన్‌ను కలుసుకున్న అమెరికా రాయబారి స్టీవ్ విన్కాఫ్ కీలక అంశాలపై చర్చలు జరిపారు. అయినప్పటికీ ఉక్రెయిన్‌పై రష్యా భీకరమైన మిస్సైల్‌తో దాడికి దిగటం గమనార్హం. రష్యాపై ఒత్తిడి తీసుకురాకుండా, శాంతి ఏర్పడదని జెలెన్‌స్కీ అన్నారు.

భారతీయ ఫార్మా గిడ్డంగిపై రష్యా దాడి!

ఉక్రెయిన్‌లోని కుసుంలో భారతీయ ఫార్మా కంపెనీకి చెందిన గిడ్డంగిపై రష్యా క్షిపణి దాడి చేసినట్టు ఉక్రెయిన్ శనివారం ఆరోపించింది. తమ దేశంలోని భారతీయ వ్యాపారాలపై రష్యా ఉద్దేశపూర్వకంగా దాడులు చేస్తున్నట్టు భారత్‌లోని ఉక్రెయిన్ ఎంబసీ ఎక్స్ వేదికగా ఆరోపించింది. భారత్‌తో ప్రత్యేక స్నేహం అని ఒక పక్క చెబుతూ మరోపక్క భారత వ్యాపారాలపై రష్యా ఉద్దేశపూర్వకంగా దాడులు చేస్తోందని ఎంబసీ పేర్కొంది.

బెంగళూరు ఎయిర్‌పోర్టు డిస్‌ప్లే బోర్డుల్లో హిందీ తొలగింపు

బెంగళూరు: బెంగళూరులోని కెంపెగౌడ అంతర్జాతీయ విమానాశ్రయంలోని డిస్‌ప్లే బోర్డుల నుంచి హిందీని తొలగించారు. ప్రస్తుతం అన్ని బోర్డుల్లో కన్నడ, ఇంగ్లిష్ భాషల్లో మాత్రమే విమానాల రాకపోకల వివరాలు కనిపిస్తున్నాయి. దీనిపై నెట్టింట పెద్ద ఎత్తున చర్చ జరుగుతున్నది. 'కేవలం ఇంగ్లిష్, కన్నడ వచ్చినవారు మాత్రమే బెంగళూరును సందర్శించాలా' అని కొందరు నెటిజన్లు బెంగళూరు విమానాశ్రయ యాజమాన్యాన్ని ప్రశ్నిస్తున్నారు. దుబాయ్ ప్రిన్స్ లాంటి ప్రముఖులు హిందీని గౌరవించి ఆ భాషలో ట్వీట్లు చేస్తుంటే.. సొంత పౌరులు కొందరు హిందీని గౌరవించడం లేదని ఒక నెటిజన్ వాపోయారు. మరో వ్యక్తి స్పందిస్తూ.. 'నేను హిందీ విధింపును వ్యతిరేకిస్తాను. కానీ విమానాశ్రయాలు, రైల్వే స్టేషన్ల వంటి ప్రయాణ కేంద్రాల నుంచి ఆ భాషను తొలగించడం అవివేకం. ఈ ప్రదేశాలు ప్రయాణాన్ని సులభతరం చేయాలి కాని క్లిష్టతరం చేయకూడదు' అని పేర్కొన్నారు.

దక్షిణాసియాలో భూ ప్రకంపనలు

- గంట వ్యవధిలో భారత్, మయన్మార్, తజకిస్థాన్‌లో నాలుగు భూకంపాలు

న్యూఢిల్లీ: దక్షిణాసియాలో ఆదివారం ఉదయం సంభవించిన భూ ప్రకంపనలు మూడు దేశాల ప్రజలను భయాందోళనలకు గురి చేశాయి. కేవలం గంట వ్యవధిలో భారత్, మయన్మార్, తజకిస్థాన్‌లోని కొన్ని ప్రాంతాల్లో నాలుగు భూకంపాలు రావడం ఈ ప్రాంతంలోని భూ పలకల అస్థిరతను గుర్తు చేసింది. మొదట రిక్టర్ స్కేల్‌పై 3.4 తీవ్రతతో హిమాచల్‌లోని మండిలో భూకంపం సంభవించింది. 5.5 తీవ్రతతో సెంట్రల్ మయన్మార్ లో ప్రకంపనలు వచ్చాయి. కొంతసేపటికి తజకిస్థాన్‌లో 6.1 తీవ్రతతో ఒకటి, 3.9 తీవ్రతతో మరొక భూకంపం వచ్చింది. ఈ భూకంపాల్లో ఎలాంటి ఆస్తి, ప్రాణ నష్టం సంభవించలేదు. వరుస భూకంపాలు హిమాలయ, మధ్య ఆసియా ప్రాంతాల్లో భూమి పలకల నిర్మాణంపై ఆందోళనలను రేకెత్తించాయి.

తప్పిపోయి.. పాక్ సరిహద్దులో తేలి

ఏపీ వ్యక్తిని కుటుంబంతో కలిపిన బీఎస్ఎఫ్

జమ్మూ, ఏప్రిల్ 13: మూడు నెలల క్రితం ఇంటి నుంచి తప్పిపోయి అంతర్జాతీయ సరిహద్దు వద్ద దిక్కుతోచక తిరుగుతున్న ఏపీ వ్యక్తిని సరిహద్దు భద్రతా దళం (బీఎస్ఎఫ్) ఆయన కుటుంబ సభ్యులకు అప్పగించింది. తూర్పు గోదావరి జిల్లాలోని నేలటూరుకు చెందిన వెంకట రావు (50) అనే వ్యక్తి మూడు నెలల క్రితం కనిపించకుండా పోయారు. ఈ క్రమంలోనే జమ్మూలోని అక్నూర్-పాక్ సరిహద్దుల్లో సంచరిస్తుండగా, మార్చి 31న అతడిని బీఎస్ఎఫ్ సిబ్బంది అదుపులోకి తీసుకుని ప్రశ్నించగా, అతను పూర్తి వివరాలు చెప్పలేక పోయాడు. అయితే అతడిచ్చిన కొన్ని వివరాలతో అతడు ఏపీకి చెందిన వాడని, తప్పిపోయినట్టు గుర్తించి, మిగతా శాఖల సహాయంతో అతడి స్వస్థలాన్ని కనుగొన్నారు. ఎట్టకేలకు ఈ నెల 11న వెంకటరావును అతని కుటుంబ సభ్యులకు అప్పగించారు. బీఎస్ఎఫ్‌కు ఆయన కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

మరో వివాదంలో తమిళనాడు గవర్నర్

విద్యార్థులతో జైశ్రీరామ్ నినాదాలు

చెన్నై: తమిళనాడు గవర్నర్ రవి మరో వివాదంలో చిక్కుకున్నారు. ఓ కార్యక్రమంలో ఆయన విద్యార్థులను 'జై శ్రీరామ్' నినాదాలు చేయాలని కోరినట్లు తెలుస్తున్నది. దీంతో ఆయనను పదవి నుంచి తొలగించాలని తమిళనాడు కామన్ స్కూల్ సిస్టమ్ వేదిక డిమాండ్ చేసింది. సుప్రీంకోర్టు చేత వాతలు పెట్టించుకున్న తర్వాత, రాష్ట్ర ప్రభుత్వం కట్టడి చేశాక, గవర్నర్ రవి ఇలాంటి స్టంట్లు చేస్తున్నారని కాంగ్రెస్ నేత శశికాంత్ ఎక్స్ పోస్ట్‌లో దుయ్యబట్టారు. 'నా ఎజెండాను ఇతర మార్గాల్లో అమలు చేస్తాను' అనే సందేశాన్ని రవి ఇస్తున్నారని ఆయన అన్నారు.

లా కమిషన్ చీఫ్‌గా జస్టిస్ దినేశ్ మహేశ్వరి!

న్యూఢిల్లీ: సుప్రీంకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ దినేశ్ మహేశ్వరి త్వరలో 23వ లా కమిషన్ చైర్‌పర్సన్‌గా నియమితులయ్యే అవకాశం ఉంది. త్వరలోనే దీనికి సంబంధించిన నోటిఫికేషన్ జారీ అవుతుందని విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. ఈ కమిషన్‌ను నిరుడు సెప్టెంబరు 2న ఏర్పాటు చేశారు. దీని పదవీ కాలం మూడేళ్లు. దేశంలో ఉమ్మడి పౌర స్మృతిని ప్రవేశపెట్టవచ్చునా? అనే అంశాన్ని పరిశీలించే బాధ్యతను ప్రభుత్వం ఈ కమిషన్‌కు అప్పగించింది. జస్టిస్ దినేశ్ మహేశ్వరి 2019 జనవరి నుంచి 2023 మే వరకు సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా పని చేశారు.

అస్సాంలో నూ 'వక్ఫ్' నిరసనలు

పోలీసులపైకి రాళ్లు రువ్విన ఆందోళనకారులు

గువహటి, ఏప్రిల్ 13: కేంద్రం తీసుకొచ్చిన వక్ఫ్ సవరణ చట్టానికి వ్యతిరేకంగా అస్సాంలోనూ నిరసనలు హోరెత్తుతున్నాయి. ఆదివారం ఆందోళనకారులు చేపట్టిన నిరసనలు హింసాత్మకంగా మారాయి. కచర్ జిల్లాలో ఆందోళనకారులను చెదరగొట్టేందుకు పోలీసులు లాఠీచార్జ్‌కు దిగగా, ఆందోళనకారులు పోలీసులపైకి రాళ్లు రువ్వారు. ఆందోళనకారులు నల్ల జెండాల్ని ప్రదర్శిస్తూ, బీజేపీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కొత్తగా తీసుకొచ్చిన వక్ఫ్ సవరణ చట్టాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

వక్ఫ్ చట్టంపై సుప్రీంకు నటుడు విజయ్

చెన్నై: నటుడు, టీవీకే పార్టీ అధినేత విజయ్ వక్ఫ్ సవరణ చట్టాన్ని సుప్రీంకోర్టులో సవాల్ చేశారు. ఈ చట్టానికి వ్యతిరేకంగా ఇప్పటికే సుప్రీం కోర్టులో పలు పిటిషన్లు దాఖలయ్యాయి. ఈ చట్టం ముస్లింల పట్ల వివక్ష చూపుతున్నదని, వారి ప్రాథమిక హక్కులను ఉల్లంఘిస్తున్నదని పిటిషనర్లు ఆరోపిస్తున్నారు. పిటిషనర్లలో ఏఐఎంపీఎల్‌బీ, ఏఐఎంఐఎం ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ, పలు పార్టీల ఎంపీలు, సమస్త కేరళ జామియాతుల్ ఉలేమా, ఎన్‌డీపీఐ, ఇండియన్ యూనియన్ ముస్లిం లీగ్, ఎన్‌జీవో అసోసియేషన్ ఫర్ ప్రొటెక్షన్ ఆఫ్ సివిల్ రైట్స్ ఉన్నాయి.

ఒక్క బల్లి 60 లక్షలు!

అస్సాంలో 11 అరుదైన బల్లులు స్వాధీనం

గువాహటి: అస్సాంలోని డిబ్రూగఢ్ పోలీసులు 11 అరుదైన టోకే గెక్కో బల్లులను శుక్రవారం స్వాధీనం చేసుకుని, ముగ్గుర్ని అరెస్ట్ చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, వీటిలో ఒక్కొక్క దానిని రూ.60 లక్షల చొప్పున విక్రయించాలనుకున్నట్లు వీరు దర్యాప్తులో తెలిపారు. వీటిని అరుణాచల్‌ప్రదేశ్ నుంచి తీసుకొచ్చినట్లు చెప్పారు. టోకే గెక్కో బల్లులు అంతరించిపోయే ప్రమాదం గల జీవుల జాబితాలో ఉన్నాయి. వీటికి వన్య ప్రాణుల పరిరక్షణ చట్టం ప్రకారం రక్షణ ఉంది. అస్సాం, అరుణాచల్ ప్రదేశ్ రాష్ట్రాల్లోని కొన్ని చోట్ల మాత్రమే ఇవి కనిపిస్తాయి.

ప్రపంచంలోనే ఎత్తయిన వంతెన

- 2,400 కోట్లతో నిర్మించిన చైనా
- ఫ్రాన్స్‌లోని ఈఫిల్ టవర్ కంటే 200 మీటర్ల అధిక ఎత్తు
- గంట ప్రయాణం నిమిషంలో పూర్తి

బీజింగ్, ఏప్రిల్ 13: అద్భుత నిర్మాణాలతో ప్రపంచాన్ని అబ్బురపరుస్తున్న చైనా త్వరలో మరో ఇంజినీరింగ్ అద్భుతాన్ని ఆవిష్కరించనున్నది. ప్రపంచంలోనే అత్యంత ఎత్తైన హువాజియాంగ్ గ్రాండ్ కాన్యన్ బ్రిడ్జిని ఈ జూన్‌లో ప్రారంభించనున్నది. గుయ్‌ఝౌలోని బీపన్ నదిపై 2,050 అడుగుల ఎత్తులో ఈ వంతెనను నిర్మించారు. రెండు మైళ్ల పొడవైన ఈ వంతెన ఫ్రాన్స్ రాజధాని పారిస్‌లోని ఈఫిల్ టవర్ కంటే 200 మీటర్ల ఎత్తుగా ఉంటుంది. 2022లో ప్రారంభమైన ఈ వంతెన నిర్మాణం మూడేండ్లలో పూర్తయింది. అందుకు 216 మిలియన్ పౌండ్లు (దాదాపు రూ.2,427 కోట్లు) ఖర్చయింది. ఈ వంతెన నిర్మాణానికి దాదాపు 22 వేల మెట్రిక్ టన్నుల ఉక్కును వినియోగించారు. ఇది మూడు ఈఫిల్ టవర్లకు సమానం. గతంలో హువాజియాంగ్ లోయ చుట్టూ తిరిగి వచ్చేందుకు గంట సమయం పట్టేదని, ఇప్పుడు ఈ వంతెన నిర్మాణంతో ఆ ప్రయాణం నిమిషంలోనే పూర్తవుతుందని చైనా అధికారులు చెప్తున్నారు. చైనా ఇంజినీరింగ్ సామర్థ్యాలను ప్రపంచానికి చాటి చెప్పడంతో పాటు గుయ్‌ఝౌను ప్రపంచ స్థాయి పర్యాటక గమ్యస్థానంగా మార్చాలన్న లక్ష్య సాధనకు ఈ సూపర్ ప్రాజెక్టు ఊతమిస్తుందని చైనా రాజకీయవేత్త జాంగ్ షెంగ్లిన్ తెలిపారు.

శత్రు సైనికులను 'గే'లుగా మార్చే బాంబు!

వాషింగ్టన్: శత్రు సైనికులు ఒకరిపట్ల మరొకరు ఆకర్షితులై, స్వలింగ సంపర్కులు (గే)గా మారేలా చేసే రసాయనిక బాంబును తయారు చేసేందుకు అమెరికన్ వాయు సేన గతంలో ప్రతిపాదించింది. మిలిటరీకి చెందిన రైట్ ల్యాబొరేటరీ 1994లో ఈ ప్రణాళికను రచించింది. ప్రాణాంతకం కాని ఆయుధాల అభివృద్ధి ప్రాజెక్టులో భాగంగా ఇటువంటి ఆలోచనలు చేసింది. యాంటీ బయలాజికల్ వెపన్స్ ఆర్గనైజేషన్ సన్‌షైన్ ప్రాజెక్టు ఈ వివరాలను బయటపెట్టింది. రసాయనాలతో కూడిన ఈ బాంబు గురించి సమీక్షించాలని సైంటిఫిక్ రివ్యూ సంస్థ నేషనల్ అకాడమీ ఆఫ్ సైన్సెస్‌ను 2002లో పెంటగాన్ కోరినట్లు ఈ డాక్యుమెంట్ వెల్లడించింది. ఇదే కాకుండా, ఈగలు, ఎలుకలు, ఇతర పురుగులు రెచ్చిపోయి సైనికులను కరిచేలా చేయడం; దుర్వాసన వచ్చే సెంటును శత్రు సైనికులపై జల్లడం వంటి ఆలోచనలపై కూడా చర్చ జరిగిందని తెలిపింది.

అమెరికాలో మిస్టరీ టవర్!

ఏలియన్స్‌పై పరిశోధన కోసమే!?

లాస్‌వెగాస్: అమెరికాలోని నెవడాలో గల అత్యంత రహస్య ఏరియా 51 మిలిటరీ బేస్‌లో త్రికోణ ఆకారంలోని వింతైన నిర్మాణాన్ని గూగుల్ ఎర్త్‌లో ఇటీవల గుర్తించారు. పొడవైన నీడను కలిగి ఉన్న ఈ టవర్ నిర్మాణ ఉద్దేశంపై అనేక అనుమానాలు, సందేహాలు వ్యక్తమవుతున్నాయి. అమెరికా మిలటరీ బేస్‌లో ఉన్న ఈ నిర్మాణం లాస్ వెగాస్‌కు 130 కిలోమీటర్ల దూరంలో ఉంది. గూగుల్ మ్యాప్స్‌లో ఈ నిర్మాణాన్ని వీక్షించవచ్చు. రహస్య సైనిక స్థావరంలో ఉన్న ఈ నిర్మాణాన్ని గ్రహాంతర కార్యకలాపాలకు లేదా గ్రహాంతర జీవులపై పరిశోధనల కోసం నిర్మించి ఉండొచ్చని చాలా మంది అనుమానం వ్యక్తం చేస్తున్నారు. అయితే దీని కార్యకలాపాలను చాలా ఏండ్ల నుంచి అమెరికా రహస్యంగా ఉంచడంతో అందులో జరిగే పనులపై రకరకాల ఊహాగానాలు వినిపిస్తున్నాయి.

తెగిన తలను అతికించారు!

మహిళ పుర్రెను వెన్నెముకతో కలిపిన అమెరికా వైద్యులు

వాషింగ్టన్: ప్రమాదవశాత్తు చేతి వేళ్లు లేదా కాలి వేళ్లు తెగిపడితే.. వాటిని తిరిగి శరీరానికి జత చేయటం (సర్జరీ ద్వారా) చాలా అరుదు. వైద్య పరంగా చాలా కష్టసాధ్యమైంది. అలాంటిది అమెరికన్ వైద్యులు, తెగిపోయిన ఓ మహిళ తలను.. తిరిగి అతికించారు! 37 శస్త్ర చికిత్సలు నిర్వహించి సదరు మహిళ పుర్రెను వెన్నెముకతో కలపటంలో అమెరికా వైద్యులు సక్సెస్ అయ్యారు. 'ద సన్' వార్తా కథనం ప్రకారం, ఇల్లినాయిస్‌కు చెందిన మేగాన్ కింగ్ తన 16వ ఏట (2005) ఓ ఫుట్‌బాల్ గేమ్‌లో తీవ్రంగా గాయపడింది. ఒక్క ఏడాదిలో వైద్యులు ఆమెకు 30కిపైగా సర్జరీలు చేశారు. ఈ క్రమంలో 2016లో ఆమె తలభాగానికి వైద్యులు ఓ సర్జరీ చేశారు. పుర్రెను తలలో చేర్చేందుకు 'హ్యాలో బ్రేస్' అనే పరికరాన్ని స్క్రూలతో బిగించారు. ఆ తర్వాత ఈ స్క్రూను తొలగిస్తుండగా.. ఆమె పుర్రె మళ్లీ వెన్నెముక నుండి దాదాపు వేరుపడింది. దీనిని సాధారణంగా అంతర్గత శిరచ్ఛేదంగా పేర్కొంటారు. ఆమె పుర్రెను న్యూరో సర్జన్ చేతితో పట్టుకున్న సందర్భాలూ ఉన్నాయి. తిరిగి ఆమె పుర్రెను వెన్నెముకకు అమర్చడానికి అత్యవసర శస్త్ర చికిత్స చేయాల్సి వచ్చింది. మొత్తం 37 సర్జరీల తర్వాత 'స్పైనల్ ఫ్యుజన్' అనే ప్రక్రియ ద్వారా మేగాన్ పుర్రెను ఆమె వెన్నెముకకు శాశ్వతంగా అమర్చారు.

రోబోల మధ్య బాక్సింగ్ మ్యాచ్

ప్రపంచంలోనే మొదటిసారి

బీజింగ్, ఏప్రిల్ 13: ప్రపంచంలోనే మొట్టమొదటిసారిగా రెండు హ్యూమనాయిడ్(మనుషులను పోలినవి) రోబోల మధ్య బాక్సింగ్ పోటీ జరగబోతున్నది. వచ్చే నెలలో జరగనున్న ఈ బాక్సింగ్ పోటీకి సంబంధించి ప్రత్యక్ష ప్రసారాన్ని చేపడుతున్